



# కరపత్రం

SINCE 2014

శనివారం అక్టోబరు 25 2025 | సంపుటి : 2 | సంచిక : 22 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4




# కర్నూలు శివారులో ఘోర బస్సు ప్రమాదం

## మంటల్లో కాలి బూడిదయిన బస్సు
## ప్రమాదంలో 19 నిండు ప్రాణాలు బుగ్గి
## బైకును ఢీకొని తగులబడ్డ బస్సు

### ప్రమాదం గుర్తించని డ్రైవర్లు
### బతికిబయటపడ్డ 22మంది
### పలువురికి గాయాలు..ఆస్పత్రిలో చికిత్స

**కర్నూలు,అక్టోబర్24 :** యాటకందని విషాదం..తెల్లవారు జామున ఏం జరిగిందో తెలుసుకునే లోపే 19 నిండుప్రాణాలు బుగ్గిగా మారాయి. నిద్రలోనే ప్రాణాలు హరీమన్నాయి. మంటల్లో బస్సు తగలుబడుతోందన్న విషయం తెలిసే లోపు ప్రాణాలు అనంతవాయువుల్లో కలిశాయి. ఎన్నో కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. మరెందరో ఆశలను బుగ్గి చేసింది. కర్నూలు జిల్లాలో జరగిన ట్రావెల్ బస్సు దుర్ఘటన కనీవినీ ఎరుగని విషాదాన్ని నింపింది. బస్సుకు మంటలు అంటుకుని బూడిదయ్యింది. బస్సులోనే ఈ 19మంది సజీవ దహనం అయ్యారు. తాము ఎక్కిన బస్సే శ్మశానవాటికి అవుతుందని...అందులో తాము సజీవ దహనం అవుతామని ఊహించని ఘటన ఇది. శుక్రవారం తెల్లవారుజాము సుమారు 2-3 గంటల సమయం. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తోంది. తాము వెళ్లాల్సిన చోటుకి సురక్షితంగా చేరుకుంటామనే నమ్మకంతో ప్రయాణికులు అంతా గాఢ నిద్రలో మునిగిపోయారు. ఒక్కసారిగా అనుకోని ప్రమాదం.. బైక్‌ను ఢీకొనడంతో బస్సులో మంటలు చెలరేగాయి. ప్రయాణికులు తేరుకునేలోపే మంటలు వ్యాపించి పొగ కమ్మేసింది. ఏం చేయాలో పాలుపోని స్థితిలో బస్సులోని అద్దాలు పగలగొట్టి కొందరు కిందకు దూకేశారు.

## కర్నూలు బస్సు దుర్ఘటనపై చంద్రబాబు సీరియస్

- » ప్రమాదానికి నిర్లక్ష్యం కారణమైతే చర్యలు తప్పవు
- » అధికారులు, మంత్రులతో వీడియో కాన్ఫరెన్స్
- » బస్సుల ఫిట్‌నెస్, సేఫ్టీపై చర్యలకు ఆదేశం



**అమరావతి,అక్టోబర్24 :** కర్నూలు బస్సు ప్రమాద ఘటన నేపథ్యంలో.. ఇతర రాష్ట్రాల రవాణా శాఖ మంత్రులు, అధికారులతో సమగ్ర విచారణకు ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశించారు.

## బస్సు ప్రమాదంపై రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి



**ఢిల్లీ:** కర్నూలు బస్సు ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ క్రమంలో మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ.. ఈ ఘటన విచారకరమని పేర్కొన్నారు. క్షతగాత్రులు వేగంగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్టు తెలిపారు. మృతులకు సంతాపం ప్రకటించారు.ప్రధాని మోదీ ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ.. ప్రమాద ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు మోదీ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ క్రమంలోనే ప్రధాని కార్యాలయం.. మృతుల కుటుంబాలకు రెండు లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. అలాగే, క్షతగాత్రులకు 50వేల తక్షణ సాయం ఇవ్వనున్నట్టు తెలిపింది.

## బస్సు ప్రమాదం.. తెలంగాణ ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటన



2 లో


**హైదరాబాద్:** హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న వేమురి కావేరి ట్రావెల్స్ బస్సు ప్రమాదం నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో కర్నూల్ బస్సు ప్రమాదంలో మరణించిన తెలంగాణ పౌరులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఐదు లక్షల ఎక్స్ గ్రేషియా.. గాయపడిన క్షతగాత్రులకు రెండు లక్షల రూపాయలు ఇవ్వనున్నట్టు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు నాణ్యమైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.



## జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 4,01,365 మంది ఓటర్లు..

### - తుది జాబితా విడుదల

**హైదరాబాద్:** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఓటర్ల తుది జాబితాను జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్ ప్రకటించారు.


2 లో




## కర్నూలు బస్సు ప్రమాదంలో ఇద్దరు టెక్కీల మృతి

- » ఒకరు ఎపివాసి కాగా.. మరొకరు తెలంగాణ వాసి
- » ఇద్దరు అమ్మాయిలూ బెంగుళూరులో పని

**హైదరాబాద్,అక్టోబర్24:** కర్నూలులో జరిగిన బస్సు ప్రమాదం తీవ్ర విషాదం నింపింది. ప్రమాదంలో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు మృతిచెందారు. ఏపీలోని బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం పూసపాడుకు చెందిన గన్నమనేని ధాత్రి (27), తెలంగాణలోని యాదాద్రి జిల్లా గుండాల మండలం వస్తకొండూరుకు చెందిన అనూషరెడ్డి చనిపోయారు.

## అంగన్‌వాడీ కేంద్రాలకు సక్రమంగా సరకులు
## సంక్షేమశాఖ అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు

**హైదరాబాద్,అక్టోబర్24 :** అంగన్వాడీ కేంద్రాలకు సరకుల సరఫరా నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని మంత్రి సీతక్క ఆదేశించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంత్రి సీతక్క శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు.



2లో..


## సిఎం రేవంత్‌తో నారా రోహిత్ భేటీ

### పెళ్లికి ఆహ్వానిస్తూ పత్రిక అందచేత



2లో..


**హైదరాబాద్,అక్టోబర్24 :** టాలీవుడ్ యంగ్ హీరో నారా రోహిత్ బ్యాచిలర్ లైఫ్ కు గుడ్ బై చెప్పనున్నారు. తన జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించబోతున్నారు. నటి శిరీష లేళ్లతో వివాహ బంధంలో అడుగుపెట్టనున్నారు. నారా కుటుంబంలో పండుగ వాతావరణం నెలకొంది. పెళ్లి పనుల్లో బిజీగా ఉన్న నారా రోహిత్.. శుక్రవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తన వివాహానికి రావాలని సీఎంను ఆహ్వానించారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నారా రోహిత్ - శిరీషల వివాహం ఈ నెల అక్టోబర్ 30న హైదరాబాద్‌లో అంగరంగ వైభవంగా జరగనుంది. ఈ వివాహ వేడుకలను ఏకంగా నాలుగు రోజుల పాటు అత్యంత ఘనంగా నిర్వహించేందుకు నారా కుటుంబం ఏర్పాట్లు చేస్తోంది.




## సెక్యూరిటీ లేకుండా చిక్కడపల్లికి రాగలవా


- నిరుద్యోగుల ప్రశ్నలకు సమాధానం చెప్పగలవా
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గట్టిగా బుద్ధి చెప్పాలి
- బాకీ కార్డు విడుదల సందర్భంగా హరీష్ విమర్శలు

**హైదరాబాద్,అక్టోబర్24 :** సీఎం రేవంత్ రెడ్డికి దమ్ముంటే పోలీసులు లేకుండా ఒక్కసారి అశోక్‌నగర్, చిక్కడపల్లి లైబ్రరీకి రావాలని సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు సవాల్ విసిరారు. బట్టలూడదీసి ఊడగొడుతారని అంటే ఘాటుగా హరీశ్‌రావు హెచ్చరించారు. కాంగ్రెస్ నిరుద్యోగ బాకీ కార్డు ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడారు. ఇచ్చిన మాట నిలుపుకో అని బాకీ కార్డులు రేవంత్ రెడ్డిని ప్రశ్నిస్తున్నాయి. ఎన్నికల ముందు వేడుకున్నడు, వాడుకున్నడు.


మిగతాది 2లో


## జూబ్లీహిల్స్ బరిలో 58మంది అభ్యర్థులు

- ⊙ తుది జాబితా ప్రకటించిన ఎన్నికల అధికారి
- ⊙ నియోజకవర్గంలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు




**హైదరాబాద్,అక్టోబర్24 :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక బరిలో అభ్యర్థుల తుది జాబితా ఖరారైంది. నవంబర్ 11న పోలింగ్ జరిగే ఉప ఎన్నికలో 58 మంది అభ్యర్థులు పోటీపడుతున్నట్టు రిటర్నింగ్ అధికారి సాయిరాం ప్రకటించారు. మొత్తం 211 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా 81 మంది అభ్యర్థులు అర్హత పొందారు. వారిలో వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు, పలువురు స్వతంత్రులు మొత్తం 23 మంది నామినేషన్లను ఉపసంహరించుకోగా.. 58 మంది పోటీలో ఉన్నట్లు ఆర్వో వెల్లడించారు.


02


## ఆస్ట్రేలియాలో మంత్రి శ్రీధర్ బాబు పర్యటన
## విక్టోరియా పార్లమెంట్ సందర్శన

**హైదరాబాద్,అక్టోబర్24:** ఆస్ట్రేలియాలో తెలంగాణ ఐటీ పరిశ్రమల శాఖా మంత్రి శ్రీధర్ బాబు పర్యటన కొనసాగుతోంది. ఇందులో భాగంగా విక్టోరియా పార్లమెంట్‌ను మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబుకు లెజిస్లేటివ్ కౌన్సిల్ గవర్నమెంట్ విప్ లీ తార్లామిస్, పార్లమెంటరీ సెక్రటరీ షీనా వాట్ ఘన స్వాగతం పలికారు. శాసన ప్రక్రియలు, పార్లమెంటరీ గవర్నెన్స్, పబ్లిక్ అకౌంటబిలిటీపై సుదీర్ఘంగా చర్చించారు.




2లో

# అంగన్‌వాడీ కేంద్రాలకు సక్రమంగా సరకులు

మొదటిపేజీ తరువాయి
పాలు, గుడ్లు, పప్పు, మంచి నూనే, బాలామృతం, మురుకులు, బియ్యం సరఫరాపై జిల్లాల వారిగా మంత్రి సీతక్క సమీక్ష చేశారు. మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలో అమలవుతున్న పథకాల ప్రగతిని మంత్రి సీతక్క సమీక్షించారు. పలు జిల్లాల్లో సరకుల సరఫరా ఆశించిన మేర లేకపోవడంపై కాంట్రాక్టర్లపై మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో మాదిరిగా సరకుల సప్లైయర్స్ వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సరకుల సరఫరాలో
అలసత్వం వహిస్తున్న కాంట్రాక్టర్లకు నోటీసులు ఇచ్చి బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆజ్ఞాపించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకారం అందించడంలో రాజీ పడేది లేదని మందలించారు. లబ్దిదారులకు అసౌకర్యం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హుకుం జారీ చేశారు. చిన్నారుల సంరక్షణ విషయంలో అంగన్వాడీ కేంద్రాల్లో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సీతక్క దిశానిర్దేశంచేశారు. చిన్నారులు అంగన్వాడీ కేంద్రానికి వచ్చిన సమయం నుంచి వారు వెళ్లే వరకు సిబ్బంది బాధ్యత వహించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో విద్యుత్ కనెక్షన్, తాగు నీటి సదుపాయం, టాయిలెట్ సౌకర్యాల కల్పన పనులను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని మార్గనిర్దేశర చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య, హాజరు శాతాన్ని పెంచాలని సూచించారు. అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో ప్రతి నెల కనీసం ఒక చిన్నారి చేరేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు మంత్రి సీతక్క. ప్లే స్కూళ్లకు ధీటుగా అంగన్వాడీ సెంటర్లు ఉన్నాయనే భరోసాను తల్లిదండ్రులకు కల్పించాలని మంత్రి సూచించారు. జిల్లా అధికారులు ప్రతి నెలా ప్రోగ్రెస్ రిపోర్టులు పంపించాలని ఆజ్ఞాపించారు. అంగన్వాడీ సిబ్బందికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేస్తున్నామని ఉద్ఘాటించారు. బాల్య వివాహాలు లేని రాష్ట్రంగా తెలంగాణ ఉండాలని సూచించారు. ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి బాల్య వివాహాలు జరుగకుండా చూడాలని దిశానిర్దేశర చేశారు. ఈ సమీక్షలో మంత్రి సీతక్కతోపాటు ఆ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజా, తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ బరిలో 58మంది అభ్యర్థులు

మొదటిపేజీ తరువాయి
ఇంత మంది పోటీ చేయడం జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ చరిత్రలో ఇదే తొలిసారి. 2009 ఎన్నికల్లో 13 మంది, 2014 ఎన్నికల్లో 21 మంది, 2018 ఎన్నికల్లో 18 మంది పోటీపడగా.. 2023లో జరిగిన ఎన్నికల్లో 19 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. వారిలో భారత రాష్ట్ర సమితి అభ్యర్థి మాగంటి గోపీనాథ్ విజయం సాధించారు. అయితే, ఆయన మరణంతో ఉప ఎన్నిక రావడంతో ఈసారి పోటీలో ప్రధాన పార్టీలతోపాటు పెద్ద సంఖ్యలో స్వతంత్రులు, విద్యార్థి సంఘాల నాయకులు, రైతులు బరిలోకి దిగారు. పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలవ్వడం చర్చనీయాంశంగా మారింది. నామినేషన్ల పరిశీలనతోపాటు ఉపసంహరణ వరకు క్షణక్షణం ఉత్కంఠను రేకెత్తిస్తున్న ఈ ఉపఎన్నికలో చివరకు 58 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు.
పలువురు అభ్యర్థులు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను తమ ఉద్యమానికి వేదికగా మలచుకునేందుకు, తమ సమస్యలను ఫోకస్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. వివిధ కారణాలు పేర్కొంటూ నామినేషన్లు దాఖలు చేశారు. దాఖలుకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5 వేలు, ఇతరులు రూ.10 వేలు చెల్లించిమరీ నామినేషన్లు వేశారు. ప్రధానంగా ప్రాంతీయ రింగు రోడ్డు భూసేకరణ నిర్వాసితులు ప్రభుత్వ తీరును నిరసిస్తూ.. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వేశారు. 12 మంది ప్రస్తుతం రంగంలో ఉన్నారు. యాచారం ఫార్మాసిటీ భూ నిర్వాసితులు 10 మంది దాఖలు చేశారు. తగిన పరిహారం ఇవ్వలేదని, భూములు తిరిగి అప్పగించాలనేది వారి డిమాండ్. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఒక సామాజిక వర్గం తరఫున 10 మంది నామినేషన్ వేశారు. ఉద్యోగ నియామక ప్రకటనలు లేవని నిరసిస్తూ నిరుద్యోగ జేఏసీ తరఫున 13 మంది నామినేషన్లు సమర్పించారు. పింఛన్లు సక్రమంగా రావడం లేదని పెన్షన్‌దారుల తరఫున 9 మంది సీనియర్ సిటిజన్లు నామినేషన్లు వేశారు. తెలంగాణ ఉద్యమకారుల తరఫున ఒకరు సమర్పించారు. ఇదిలావుంటే జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఓటర్ల తుది జాబితాను జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్ ప్రకటించారు. ఉపఎన్నికపై శుక్రవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 2,08,561 మంది పురుషులు, 1,92,779 మంది మహిళలు. ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత జూబ్లీహిల్స్‌లో 2,383 మంది ఓటర్లు పెరిగారు. తనిఖీల్లో భాగంగా ఇప్పటి వరకు రూ.2.84 కోట్లు స్వాధీనం చేసుకున్నాం. రూ.3.69 లక్షల విలువ చేసే 512 లీటర్ల మద్యం పట్టుబడింది. ఉప ఎన్నిక బరిలో 58 మంది అభ్యర్థులు ఉన్నందున ఒక్కో పోలింగ్ బూత్‌లో.. నాలుగు బ్యాలెట్ యూనిట్స్, ఒక వీవీ ప్యాట్ వినియోగిస్తాం అని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.

# సెక్యూరిటీ లేకుండా చిక్కడపల్లికి రాగలవా

మొదటిపేజీ తరువాయి
అధికారంలోకి వచ్చాక వదిలేసారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో అశోక్ నగర్, సరూర్ నగర్ స్టేడియంలో మీటింగులు పెట్టించారు. ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి అని మాయ మాటలు చెప్పారు. మోసం చేసారు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వడం లేదు గానీ, రెండు నెలల ముందే మద్యం నోటిఫికేషన్లు ఇచ్చిండు. జాబ్ క్యాలెండర్ అని జాబ్ లెస్ క్యాలెండర్ విడుదల చేసారు. జాబ్ క్యాలెండర్‌లో చెప్పినట్లు ఒక్క నోటిఫికేషన్ అయినా ఇచ్చారా రేవంత్ రెడ్డి. 2 లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ బోగస్. రాజీవ్ యువ వికాసం వికసించకముందే వాడిపోయింది. జూన్ 2 నాడు 5 లక్షల మంది నిరుద్యోగులకు యువ వికాసం కింద సాయం చేస్తం అన్నడు. మాటలు బోగస్ హామీలు బోగస్ అయ్యాయని హరీశ్‌రావు మండిపడ్డారు. రేవంత్ రెడ్డి కళ్లు తెరిపించేందుకు మీ చేతిలో అవకాశం ఉంది. కొంతమంది నిరుద్యోగులు కూడా నామినేషన్లు వేసారు. కాంగ్రెస్ పార్టీని చిత్తుగా జూబ్లిహిల్స్‌లో ఓడించాలె. ఆనాడు కాంగ్రెస్‌ను గెలిపించేందుకు బస్సు యాత్ర చేసారు. కాంగ్రెస్‌కు సురుకు పుట్టాలంటే జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీని ఓడించేందుకు నిరుద్యోగులు దండు కట్టాలె. నిరుద్యోగ యువకులే కాంగ్రెస్‌ను ఓడించారనే
విషయం రాహుల్ గాంధీకి అర్థం కావాలె. తనతప్పు తాను తెలుసుకునేందుకు మనం కాంగ్రెస్‌ను ఓడించాలె అని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. విద్యా శాఖ మంత్రిగా, మున్సిపల్ మంత్రిగా, హోం మంత్రిగా, ముఖ్యమంత్రిగా సీఎం రేవంత్ రెడ్డి ఫెయిల్ అయ్యాడని హరీశ్‌రావు తీవ్రంగా విమర్శించారు. కలెక్షన్ల మంత్రిగా, వసూళ్ల మంత్రిగా మాత్రం పాస్ అయిపోయిండు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.జీవో 29, జీవో 55పై నేను ఆనాడు అసెంబ్లీలో గట్టిగా మాట్లాడాను. భట్టి గారు దళిత మంత్రిగా ఉన్నారు మీరైనా పట్టించుకోండి అంటే పట్టించుకోలేదు. జాబులు నింపండి అంటే జేబులు నింపుకుంటున్నరు. గల్లా పెట్టెలు నింపుకుంటున్నరు. విద్య రాని వ్యక్తి విద్య శాఖ మంత్రి. అతి ఎక్కువ క్రిమినల్ కేసులు ఉన్న వ్యక్తి హోం మంత్రిగా ఉన్నారని హరీశ్‌రావు విమర్శించారు. మా ప్రభుత్వం టీఎస్ ఐపాస్ ద్వారా పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించింది. నేడు ఈ ప్రభుత్వం మంత్రులు, ముఖ్యమంత్రి గన్నులు పెట్టి బెదిరిస్తున్నరు. రేవంత్ రెడ్డి గన్ ఇచ్చి పంపించాడు అని మంత్రి కుమార్తె చెప్పింది. ఐఏఎస్ ఆఫీసర్ వీఆర్ఎస్‌తో మధ్యలోనే వెళ్లిపోతున్నడు. లక్షా 64వేల ప్రభుత్వ ఉద్యోగాలను బిఆర్ఎస్ ఇచ్చింది. గ్రూప్ 1, గ్రూప్ 2 ఆలస్యం అయ్యింది. 5 శాతం లోకల్ రిజర్వేషన్ సాధించాం. నోటిఫికేషన్లు ఇచ్చింది బిఆర్ఎస్, పరీక్ష పెట్టింది బిఆర్ఎస్, ఫిజికల్ టెస్టు పెట్టింది బిఆర్ఎస్, ఎంపిక చేసింది బిఆర్ఎస్. నియామకపత్రాలు ఇచ్చింది రేవంత్. దీంతో 60వేల ఉద్యోగాలు ఇచ్చినా అని ప్రచారం చేసుకుంటున్నడు రేవంత్ రెడ్డి అని హరీశ్‌రావు మండిపడ్డారు. అందులో 15400 ఎస్పై కానిస్టేబుల్ నోటిఫికేషన్ ఇచ్చింది బిఆర్ఎస్. 9 వేల గురుకులాల ఉద్యోగాల నోటిఫికేషన్ ఇచ్చింది బిఆర్ఎస్. 8 వేల గ్రూప్ 4 నోటిఫికేషన్ ఇచ్చింది బిఆర్ఎస్. హెల్త్ డిపార్టుమెంట్‌లో 7 వేల ఉద్యోగాలు ఇచ్చింది బిఆర్ఎస్. జేఎల్ 1300, ఆరు వేల టీచర్ల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది బిఆర్ఎస్. అచ్చంగా కాంగ్రెస్ నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేసింది కేవలం 10 వేల ఉద్యోగాలు మాత్రమే అని హరీశ్‌రావు పేర్కొన్నారు.వెంటనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నాం. మేం హామి ఇస్తున్నాం. అసెంబ్లీ వేదికగా మీకోసం పోరాటం చేస్తం. మొన్న అడిగితే ఒక్కటే నాడు అసెంబ్లీ పెట్టి పారిపోయిండు. అసెంబ్లీ పెట్టడానికి కూడా భయమే. జెన్కో, జీపీవో, పోలీసు, డిప్యూటీ సర్వేయర్, ఇతర గ్రూప్స్ నోటిఫికేషన్ల కోసం బిఆర్ఎస్ పోరాటం చేస్తుంది. అన్ని జిల్లా కేంద్రంలో బాకీ కార్డులు పెట్టి యువతను ఏకం చేస్తం. ప్రత్యక్ష పోరాటం బిఆర్ఎస్ చేస్తుంది. మీకు అండగా ఉంటది అని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

# జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 4,01,365 మంది ఓటర్లు..

మొదటిపేజీ తరువాయి
ఉపఎన్నికపై శుక్రవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. "నియోజకవర్గంలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 2,08,561 మంది పురుషులు, 1,92,779 మంది మహిళలు. ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత జూబ్లీహిల్స్‌లో 2,383 మంది ఓటర్లు పెరిగారు. తనిఖీల్లో భాగంగా ఇప్పటి వరకు రూ.2.84 కోట్లు స్వాధీనం చేసుకున్నాం. రూ.3.69 లక్షల విలువ చేసే 512 లీటర్ల మద్యం పట్టుబడింది. ఉప ఎన్నిక బరిలో 58 మంది అభ్యర్థులు ఉన్నందున ఒక్కో పోలింగ్ బూత్‌లో.. నాలుగు బ్యాలెట్ యూనిట్స్, ఒక వీవీ ప్యాట్ వినియోగిస్తాం" అని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.

# కర్నూలు శివారులో ఘోర బస్సు ప్రమాదం

మొదటిపేజీ తరువాయి
మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మృతుల వివరాలు గుర్తించి కుటుంబాలకు తక్షణ సాయం అందించాలని ఆదేశించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలన్నారు. ప్రైవేటు బస్సుల ఫిట్‌నెస్, సేఫ్టీ, పర్మిట్ తనిఖీలకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. అన్ని జిల్లాల్లో బస్సుల సాంకేతిక తనిఖీలు చేపట్టాలన్నారు. ప్రమాదానికి నిర్లక్ష్యమే కారణమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రమాదానికి గురైన ప్రైవేటు బస్సు రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్, పర్మిట్ వివరాలపై పూర్తి నివేదికను కోరారు.అన్ని జిల్లాల్లో బస్సుల్లో సాంకేతిక తనిఖీలు చేపట్టాలని రవాణా శాఖకు ఆదేశాలు జారీచేశారు. ప్రమాదానికి కారణం.. నిర్లక్ష్యమని తేలితే కఠిన చర్యలు తప్పవని ట్రావెల్స్ బస్సు యాజమాన్యానికి సీఎం హెచ్చరికలు జారీ చేశారు. ప్రజల భద్రతే ప్రభుత్వానికి ప్రాధాన్యత, మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం త్వరితగతిన అందిస్తామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితి సమీక్షిస్తున్నారని సీఎంకు తెలియజేశారు మంత్రి. అలాగే ప్రమాదానికి గురైన ప్రైవేట్ బస్సు రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్, పర్మిట్ వివరాలపై పూర్తి నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్ర ప్రజల భద్రతపై ఎలాంటి రాజీ ఉండదని సీఎం చంద్రబాబు, మంత్రి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.

# కర్నూలు బస్సు ప్రమాదంలో ఇద్దరు టెక్కీల మృతి

మొదటిపేజీ తరువాయి
వీరిద్దరూ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు.ధాత్రి ఇటీవల హైదరాబాద్‌లోని పెదనాన్న ఇంటికి వచ్చారు. అక్కడి నుంచి బెంగళూరు వెళ్లేందుకు గురువారం రాత్రి వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు ఎక్కి ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. విషయం తెలుసుకున్న ధాత్రి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతురాలి తల్లి వాణి, బంధువులు సంఘటనా స్థలానికి బయలుదేరి వెళ్లారు. ధాత్రి మృతికి పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సంతాపం తెలిపారు. యాదాద్రి జిల్లాకు చెందిన అనూషరెడ్డి దీపావళికి స్వగ్రామానికి వచ్చి గురువారం రాత్రి బెంగళూరుకు బయల్దేరారు. ఖైరతాబాద్‌లో బస్సు ఎక్కి ఈ దుర్ఘటనలో మృతిచెందారు.
అనూష మృతితో ఆమె తల్లిదండ్రులు కన్నీమున్నీరవుతున్నారు. బస్సు ప్రమాదంలో మృతిచెందిన మరికొందరిని గుర్తించాల్సి ఉంది.

# బస్సు ప్రమాదం.. తెలంగాణ ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటన

మొదటిపేజీ తరువాయి
ఇక, కర్నూలు ప్రమాదంలో బైకర్ సహా 20 మంది ప్రయాణీకులు మృతి చెందిన విషయం తెలిసిందే. రోడ్డు ప్రమాదంలో దగ్ధమైన బస్సులో 19 మృతదేహాలను వెలికితీశారు. ఫోరెన్సిక్ బృందాలు వీటిని బస్సులో నుంచి వెలికితీశాయి. ఈ ఘటన నుంచి 21 మంది స్వల్పగాయాలతో బయటపడ్డారు. వీరితో తెలంగాణకు సంబంధించిన వారి వివరాలు తెలియాల్సి ఉంది.
ఇదిలా ఉండగా.. హైదరాబాద్ నుంచి పలువురు ప్రయాణికులు బెంగళూరుకు వెళ్లారు. సూరారంలో ఇద్దరు, జేఎన్‌టీయూ వద్ద ముగ్గురు ప్రయాణికులు బస్సు ఎక్కారు. సూరారం వద్ద ఎక్కిన గుణసాయి కిటికీలోంచి దూకి సురక్షితంగా బయటపడగా.. మరో వ్యక్తి ప్రశాంత్ ఫోన్ సిచ్ఛాఫ్ వస్తోంది. జేఎన్‌టీయూ వద్ద ఎక్కిన ముగ్గురిలో ఒకరు సురక్షితంగా బయటపడగా.. మరో ఇద్దరి ఫోన్లు స్విచ్ఛాఫ్ వస్తున్నాయి. అంతేకాకుండా.. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నుంచి బయలుదేరిన వారు ఇద్దరు ఉన్నారు. బెంగళూరుకు చెందిన తల్లీ కుమారులు పిలోమి నాన్ బేబీ(64), కిషోర్ కుమార్(41) ఇటీవల దీపావళి పండగకు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని కృషి డిఫెన్స్ కాలనీలోని బంధువు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రాము ఇంటికి వచ్చారు.
గురువారం సాయంత్రం పటాన్‌చెరు అంబేడ్కర్ కూడలి వద్ద వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు ఎక్కి బెంగళూరు బయలుదేరారు. అయితే ఈ లోపే చిన్నటేకూరు వద్ద బస్సు ప్రమాదానికి గురవడంతో వీరు క్షేమంగా ఉన్నారా లేదా? అనేది తెలియడం లేదు. వారి ఆచూకీ కనుక్కునేందుకు రాము దంపతులు కర్నూలుకు బయలుదేరి వెళ్లారు.

# ఆస్ట్రేలియాలో మంత్రి శ్రీధర్ బాబు పర్యటన విక్టోరియా పార్లమెంట్ సందర్శన

మొదటిపేజీ తరువాయి
పారదర్శకత, జవాబుదారీతనం పెరగాలంటే పౌరుల భాగస్వామ్యం కీలకమని అన్నారు మంత్రి శ్రీధర్ బాబు. టెక్నాలజీ ఆధారిత, పౌర కేంద్రిత పాలన వైపు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. తెలంగాణ ? విక్టోరియా ఇన్‌స్టిట్యూషనల్ కొలాబరేషన్ పెంచేందుకు చొరవ చూపుతామని మంత్రి తెలిపారు. అలాగే తెలంగాణలో అమలవుతున్న ప్రోగ్రెసివ్ లెజిస్లేటివ్ ప్రాక్టీసెస్, గవర్నెన్స్ రిఫార్మ్స్, డిజిటల్ ఇనీషియేటివ్స్‌ను విక్టోరియా ప్రతినిధులకు మంత్రి వివరించారు.ఇక... రాష్ట్రంపై విక్టోరియా నేతలు ప్రశంసల వర్షం కురిపించారు. తెలంగాణ రోల్ మోడల్ రాష్ట్రం అంటూ కొనియాడారు. ద్వైపాక్షిక సహకారం పెంపొందించేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా విక్టోరియా ప్రతినిధులు హామీ ఇచ్చారు.

# వర్ష ప్రభావ పరిస్థితులపై చంద్రబాబునాయుడు ఆరా

- దుబాయ్ నుంచి మరోమారు సీఎం టెలికాన్ఫరెన్స్
- జిల్లాలకు రూ.1 కోటి చొప్పున అత్యవసర నిధుల మంజూరు

దుబాయ్ పర్యటనలో బిజీబిజీగా ఉన్నప్పటికీ రాష్ట్రంలో వర్ష ప్రభావ పరిస్థితులపై ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆరా తీస్తున్నారు తాజాగా రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై దుబాయ్ నుంచి అధికారులతో మరోమారు సీఎం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తీసుకోవాల్సిన చర్యలపై మంత్రులు, సీఎస్, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో మాట్లాడారు. వర్ష ప్రభావిత నెల్లూరు, ప్రకాశం, కడప, తిరుపతి, అన్నమయ్య జిల్లాల పరిస్థితిపై ఆయా జిల్లాల కలెక్టర్లు, ఆర్టీజీఎస్ అధికారులతో ముఖ్యమంత్రి చర్చించారు. నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాలకు రూ.2 కోట్ల చొప్పున, మిగతా వర్ష ప్రభావిత జిల్లాలకు రూ.1 కోటి చొప్పున అత్యవసర నిధుల మంజూరుకు సీఎం ఆదేశాలు జారీ చేశారు.వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను పంపాలని సూచనలు చేశారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. రెవెన్యూ, డిజాస్టర్, పోలీస్, ఇరిగేషన్, మున్సిపల్, ఆర్ అండ్ బి విద్యుత్ శాఖలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు సీఎం. లోతట్టు ప్రాంతాల్లోని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. రిలీఫ్ కేంద్రాల్లో బాధితులకు నాణ్యమైన ఆహారం, పిల్లలకు పాలు అందించాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో ఇప్పటికే కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు సీఎంకు కలెక్టర్లు వివరించారు. కాలువ, చెరువు గట్లకు గండ్లు పడకుండా బలహీనంగా ఉన్న చోట్ల పటిష్ట పరచాలని.. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా చూడాలని సీఎం ఆదేశించారు. పంట నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు.

# సిఎం రేవంత్‌తో నారా రోహిత్ భేటీ

మొదటిపేజీ తరువాయి
అక్టోబర్ 25న హల్దీ వేడుకతో పెళ్లి సంబరాలు మొదలవుతాయి. అక్టోబర్ 26న సంప్రదాయబద్ధంగా పెళ్లికొడుకు కార్యక్రమం జరగనుంది. అక్టోబర్ 28న మెహందీ వేడుక, 29న సంగీత్ నైట్ నిర్వహించనున్నారు. చివరగా, అక్టోబర్ 30న రాత్రి 10:35 గంటలకు శుభ ముహూర్తాన రోహిత్, శిరీష ఒక్కటవ్వనున్నారు. ఈ వేడుకకు సినీ, రాజకీయ రంగాల నుంచి పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు - భువనేశ్వరి దంపతులు పెద్దలుగా ఈ వివాహ వేడుకలో పాల్గొననున్నారు. రోహిత్, శిరీషల పరిచయం వెనుక ఒక ఆసక్తికరమైన నేపథ్యం ఉంది. వారిద్దరూ కలిసి నటించిన 'ప్రతినిధి?2' సినిమా షూటింగ్ సమయంలోనే స్నేహం ఏర్పడింది. అది క్రమంగా ప్రేమగా మారింది. ఇరు కుటుంబాల అంగీకారంతో గత ఏడాది అక్టోబర్ 13న హైదరాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో వీరి నిశ్చితార్థం ఘనంగా జరిగింది. అయితే, నిశ్చితార్థం జరిగిన కొద్ది కాలానికే రోహిత్ తండ్రి నారా రామ్మూర్తి నాయుడు కన్నుమూయడంతో పెళ్లిని వాయిదా పడింది. దాదాపు ఏడాది తర్వాత ఇప్పుడు పెళ్లి తేదీ ఖరారు చేశారు. సినీ పరిశ్రమలో ఈ వివాహం'ఈ ఏడాది అత్యంత ఆకర్షణీయమైన స్టార్ వెడ్డింగ్'గా నిలవనుంది.

# కరీంనగర్ జాగృతిలో చేరిన ఉద్యమకారులు.

**కరపత్రం ప్రతినిధి ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 24**
జాగృతిని కరీంనగర్ జిల్లాలో బలోపేతం చేయడంలో భాగంగా జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని కేంద్ర జాగృతి కార్యాలయంలో జాగృతి అధ్యక్షురాలు కవిత జాగృతి కండువాలు కప్పి జాగృతిలో చేర్చుకున్నారు .జాగృతి చేరిన వారిలో తెలంగాణ ఉద్యమ కారుడు బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం సీనియర్ నాయకుడు పెండ్యాల మహేష్, తిమ్మాపూర్ మండలం మల్లాపూర్ మాజీ ఉపసర్పంచ్ బుడిద పర్శారం గౌడ్, తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు చంటి శ్రీనివాస్, బిఆర్ఎస్ యువజన విభాగం జిల్లా నాయకులు దెబ్బటి సూర్య, పెరుమండ్ల అభిషేక్, కరీంనగర్ బ్యూటీ అసోసియేషన్ సభ్యులు కోండ్ర శోభరాణి, మౌనిక, తదితరులు జాగృతిలో చేరినారు.




ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ కరీంనగర్ జాగృతి ని బలోపేతం చెయ్యాలని, చాలా తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన నాయకులు ఉన్నారని తెలంగాణ రాష్ట్రం వచ్చినప్పటికీ ఉద్యమ కారులను అనుకున్నంత మేరకు న్యాయం చేయలేక పోయాయని అన్నారు .రానున్న రోజులలో సామాజిక తెలంగాణ ఉద్యమకారును కాపాడుకుంటం అని అన్నారు.

ఈనెల 25 నుండి రాష్ట్ర వ్యాప్తంగా జాగృతి జనం బాట కార్యక్రమం మొదలవుతుందనీ,అందులో భాగంగా ఈనెల 31 తేదీ వచ్చే 1 తేదీ నాడు కరీంనగర్ జిల్లాలో జనం బాట మొదలవుతుందనీ ,ఈ కార్యక్రమాన్ని జాగృతి నాయకులను ప్రజలు మేధావులును ఉద్యోగ నిరుద్యోగులను, వ్యాపార వర్గాలను, డాలర్లను ఇంజనీర్లను, అడ్వకేట్స్ లను పెద్దఎత్తున భాగస్వామ్యం చెయ్యాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జాగృతి ఆరోగ్య విభాగం అధ్యక్షుడు మేకల తిరుపతి, రూప, విజయ, కొత్తురి రఘు, శ్రీరాముల రమేష్, గర్షకుర్తి విద్యాసాగర్, లతో పాటు పలువురు మహిళలు, యువకులు పాల్గొన్నారు

# సింగరేణి స్కూల్ ను సందర్శించిన జీఎం ఎడ్యుకేషన్ (కార్పొరేట్)

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని అక్టోబర్ 24:**
సింగరేణి ఎడ్యుకేషనల్ జీఎం (కార్పొరేట్) వెంకట చారి కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సందర్భముగా శుక్రవారం రోజున సింగరేణి హైస్కూల్ సెక్టార్-2, ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాటశాల కరస్పాండెంట్, పర్సనల్ మేనేజర్ ఎం.రవీందర్ రెడ్డి, హెడ్ మాస్టర్ సంతోష్ కుమార్ వారికి ఆహ్వానం తెలియజేసి పూల బోకే అందజేసి శాలువాతో సన్మానం చేసారు. ఈ సందర్భముగా సింగరేణి ఎడ్యుకేషనల్ జీఎం (కార్పొరేట్) వెంకట చారి గారు పాటశాల కరస్పాండెంట్, పర్సనల్ మేనేజర్ ఎం.రవీందర్ రెడ్డి, హెడ్ మాస్టర్ సంతోష్, ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి వారి యొక్క సమస్యలను మరియు స్కూల్ కు కావలసిన అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జీఎం ఎడ్యుకేషన్ (కార్పొరేట్) వెంకట చారి మాట్లాడుతూ సింగరేణి పాఠశాలలో విద్యార్థుల అడ్మిషన్లు, ఉపాధ్యాయుల రికార్డులు పరిశీలించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వారి ప్రగతి కోసం ఈ విద్యాసంవత్సర,ము పదవ తరగతిలో నూటికి నూరు శాతం మంచి ఫలితాలు సాధించాలని దానికి తగిన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థి కూడా ఒక లక్ష్యం పెట్టుకొని లక్ష్య సాధనకోసం అహర్నిశలు కష్ట పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వారి ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ.

**కరపత్రం ప్రతినిధి ప్రతినిధి వీణవంక అక్టోబర్ 24**
కరీంనగర్ జిల్లా, వీణవంక మండలం, మల్లారెడ్డిపల్లి గ్రామంలో గల పెద్దమ్మ తల్లి దేవా లయంలో గత 36 శుక్రవారాలుగా జరుగుతున్న అన్నప్రసాద వితరణ కార్యక్రమం. తేది:24-10-2025 శుక్రవారం రోజున దూలం అంజి వి 6 రిపోర్టర్ జన్మదినం సందర్భంగా వారి ధర్మపత్ని సునీత వారి కుమారులు సాయి తేజ, రాజకుమార్ వారి తల్లి దూలం రాధమ్మ కుటుంబ సభ్యులు ఈరోజు పెద్దమ్మతల్లి దేవాలయంలో 36 వ శుక్రవారం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్%ఏ%అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వ్యవస్థాపక అధ్యక్షులు గోనెల సమ్మన్న ముదిరాజ్ మాట్లాడుతూ ఇక్కడ స్వయంభు వెలసిన శ్రీ పెద్దమ్మ తల్లి భక్తుల కోరిన కోరికలు తీర్చే ఇలవేల్పుగా కొలువబడుతుందని, ఈ ఆలయ ఆవరణలో ఎలాంటి పేపర్ ప్లేట్లు గాని,



ప్లాస్టిక్ గ్లాసులు గాని, వాడకుండా మోదుగాకులలో భోజనాలు వడ్డిస్తు, పర్యావరణాన్ని రక్షిస్తున్నామని తెలియజేసినారు. అనంతరం రాత్రి 8 గంటల నుండి 10 గంటల వరకు గణేష్ కళాబృందం వారి చే భజన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వ్యవస్థాపక అధ్యక్షులు గోనెల సమ్మన్న ముదిరాజ్,



ఆలయ అర్చకులు ముక్తవరపు శ్రీధరాచార్యులు,అమ్మ ఫౌండేషన్ సభ్యులు,కర్రె వెంకట నర్సయ్య,గోనెల మొండయ్య,
గోనెల అఖిల్ , గంధంప్రశాంత్,రాయణవేణి చిన్న అనిల్,కర్రెస్వామి,కర్రెరాజు,కర్రెలచ్చయ్య,
మోరెచంద్రయ్య,
మరియు భగవత్ బంధువులు,భక్తులు పాల్గొన్నారు.

# కుమారుడి యాదిలో దాతృత్వం చాటిన దంపతులు

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని అక్టోబర్ 24:**



చేతికందివచ్చిన చెట్టంత కొడుకును కోల్పోయిన పుట్టెడు దుఃఖంలోనూ ఓ అభాగ్య కుటుంబానికి ఆపన్న హస్తం అందించడానికి ముందుకొచ్చారు గోదావరిఖని కాకతీయ నగర్ కు చెందిన సిరిపురం శ్రీనివాస్-మమత దంపతులు. గత సంవత్సరం రోడ్డు ప్రమాదానికి గురై మరణించిన తమ కుమారుడు సిరిపురం వంశీ ప్రథమ వర్ధంతి సందర్భంగా, ఆయన స్మారకార్థం.. ప్రమాదానికి గురై అచేతన స్థితిలో ఉన్న స్థానిక గంగా నగర్ కు చెందిన మమతగిరి సతీష్ కుటుంబానికి నెలరోజులకు సరిపడా నిత్యావసర సరుకులను శ్రీనివాస్, మమత దంపతులు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులు మాట్లాడుతూ పుట్టెడు దుఃఖంలో కూడా కుమారుడి యాదిలో ఇతరులకు సహాయపడడం అభినందించదగిన విషయమన్నారు. ఈ నిస్సహాయ కుటుంబానికి సహాయంచేయడానికి దాతలు ముందుకు రావాలని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో సతీష్ తల్లి శోభమ్మ, భార్య ఉమతోపాటు శ్రీనివాస్ కుటుంబసభ్యులు వాణి, కళాకారులు మేజిక్ రాజా, కాసిపాక రాజమౌళి, బోడకుంట వెంకట్రాజం, వెంకటలక్ష్మి, మాదరి వాసు, బీరుక లక్ష్మణ్, చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

# కార్తిక మాసాన్ని పురస్కరించుకొని మెదక్ ఆర్టీసీ డిపో నుండి ప్రత్యేక బస్సులను నడుపుతున్నాం

- మెదక్ డిపోఆర్టీసీ సంస్థ

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట అక్టోబర్ 24**
మెదక్ ఆర్టీసీ డిపో నుండి కార్తీక మాసం సందర్భంగా స్పెషల్ బస్సులు ప్రత్యేక ప్యాకేజీ బస్సులు ప్రసిద్ధ చెందిన పుణ్య క్షేత్రాలకు నడపడం జరుగుతుంది మెదక్ నుండి శ్రీశైలం వరకు డీలక్స్ బస్సు కు పెద్దలకు రానుపోను ఛార్జ్ 1300 పిల్లలకు 750 రూపాయలు మాత్రమే ఎక్స్ప్రెస్ బస్సు కు పెద్దలకు 1150






రూపాయలు పిల్లలకు 650 రూపాయలు తీసుకొని మెదక్ నుంచి శ్రీశైలం దర్శనం చేయించుకుని తిరిగి తీసుకురావడం జరుగుతుంది మెదక్ నుండి వేములవాడ కొండగట్టు ధర్మపురి కాళేశ్వరం ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకు డీలక్స్ బస్సు కు రాను పోను చార్జీ పెద్దలకు వెయ్యి రూపాయలు పిల్లలకు 600 ఎక్స్ప్రెస్ బస్సు నకు పెద్దలకు 850 రూపాయలు పిల్లలకు 500 రూపాయలు మాత్రమే ఇట్టి అవకాశాన్ని మెదక్ పట్టణ పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకో గలరు మెదక్ నుంచి నాచారం కొమరవెల్లి యాదగిరిగుట్ట రమనేశ్వరం స్వర్ణ గిరి కి కూడా ప్రతి శనివారం ఉదయం బస్సు బయలుదేరి సాయంత్రం కి తిరిగి చేరుకుంటుంది దీనికి పెద్దలకు 600 పిల్లలకు 400 రూపాయల ఛార్జ్ చేయడం జరుగుతుంది.అంతేకాకుండా ఇంకా ఏమైనా ప్రత్యేకమైన పుణ్యక్షేత్రాలకు బస్సు సౌకర్యం కల్పించాలంటే పార్టీకి సంస్థకు సమాచారం ఇవ్వాలని .ఈ కార్తీక మాసం అవకాశాన్నిప్రయాణికులుప్రయాణికులువినియోగించు కోగలరు.సదా మీ సేవలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉంటుందని రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థయాజమాన్యం తెలిపారు

# శివంపేట్ మండల పరిధిలోని నేడుపలు గ్రామాల్లో

- వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవ కార్యక్రమాలకు
- ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభోత్సవాలను చేయనున్న
- శివంపేట్ మండల పి ఎ సి ఎస్ చైర్మన్ చింతల వెంకట్రామిరెడ్డి



**కరపత్రం ప్రతినిదిమివెల్దుర్తి మాసాయిపేట అక్టోబర్ 24**
మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలో శివంపేట మండలంలోని పలు గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలనుప్రారంభించనున్న శివంపేట పిఎసిఎస్ చైర్మన్ చింతలవెంకట్రాంరెడ్డి ఆయన సొంత గ్రామమైనటువంటి కొంతాన్‌పల్లి - ఉదయం 8:30 నిమిషాలకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రానికి ప్రారంభించి అనంతరం ఉసిరికపల్లి ఉదయం 9:30 నిమిషాలకు సీతారాం తాండా - ఉదయం 10:00 గంటలకు రత్నాపూర్ ఉదయం 11:00 గంటలకుదంపిల్లుట్ల - ఉదయం 11:30 నిమిషాలకు అల్లీపూర్ - మధ్యాహ్నం 12:00 గంటలకు శివంపేట్ - మధ్యాహ్నం 1:00 గంటలకు వరి ధాన్యం కొనుగోలు సెంటర్ల ప్రారంభోత్సవాలు ఘనంగా ప్రారంభింప పడతాయని కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలియజేశారు శివంపేట కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మండల నాయకులు, రైతులు, మీడియా మిత్రులు హాజరుకావాలని చింతల వెంకటరామిరెడ్డి అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శివంపేట కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తెలియజేశారు .

# గో హత్యలు చేస్తే కబర్ధర్

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట అక్టోబర్ 24**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో గోరక్ష ప్రముఖ్ దేవులపల్లి నవీన్ మాట్లాడుతూ
మొన్న జరిగిన సంఘటన గో మాతల ను కొంత మంది ఎం. ఐ ఎం గుండాలు తరలిస్తుంటే వాటికి అడ్డుకున్న గోరక్ష కార్యకర్తల పై జరిగిన దాడి విషయం పై మరియు గోశాల ఏర్పాటు కొరకు జమ్మికుంట తహసీల్దార్ వెంకట్ రెడ్డి కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ విషయం పై జమ్మికుంట గోరక్ష ప్రముఖ్ దేవులపల్లి నవీన్ మాట్లాడుతూ మన భారతీయ సంస్కృతిలో గోవును పవిత్రమైన జంతువుగా భావించి, "గోమాత"గా పూజిస్తారు. అయితే ఇటీవలి కాలంలో రాష్ట్రవ్యాప్తంగా గోహత్యలు పెరుగుతున్నాయి.



ఇది మానవతా విలువలకు, సాంప్రదాయాలకు, జంతు సంరక్షణ చట్టాలకు విరుద్ధంగా ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, జిల్లా స్థాయి అధికారులు తగిన చర్యలు తీసుకొని, ఇలా గో హత్యలు చేసే వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకొని గోమాంస రవాణా, విక్రయం మరియు హత్యలను అరికట్టేందుకు ప్రత్యేక బృందాలు నియమించవలసిందిగా మనవి. అలాగే గోశాలలు ఏర్పాటుచేసి గోశాలలకు తగిన ఆహారం, నీటి సదుపాయం కల్పించి, అవి సక్రమంగా నడిచేలా పర్యవేక్షణ చేయాలి. అని ఆయన అన్నారు గోహంతకులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నాము
మన ప్రాంతంలో ఇలా గో హత్యలు గాని గోవులను తరలించే వారిపైన తగిన చర్యలు తీసుకోవవలసిందిగా కోరుకుంటున్నాము ఈ కార్యక్రమంలో ప్రభు,శ్రీనివాస్,
అరవింద్, హరీష్, అంజి తదితరులు పాల్గొన్నారు

# ఆర్డీవోకు వినతి పత్రం అందించిన గో సంరక్ష రక్షకులు .

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 24**
భాగ్యనగర్ లోని రాంపల్లి వద్ద జరిగిన సంఘటనలో గోరక్షకుడు సోనూ సింగ్‌పై గో కశకుడు (గోవు వధకుడు) ఇబ్రహీం , అతని సహచరులు తుపాకులతో కాల్పులు జరపడం తీవ్రంగా ఖండనీయమని విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర నాయకులు తెలిపారు.గో రక్షకులను లక్ష్యంగా చేసుకొని జరుగుతున్న ఈ తరహా దాడులు చట్టరహిత పాలనను గుర్తు చేస్తున్నాయని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గోవు వధ నిషేధ చట్టాన్ని అమలు చేయకుండా, హింసాత్మక మూలకాలను ప్రోత్సహించడం వల్లే ఈ ఘటనలు జరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.పోలీసులు నిందితులను శిక్షించాల్సిన స్థానంలో




గాయపడిన సోనూ సింగ్‌పై తప్పుడు ఆరోపణలు చేయడం దారుణమని పేర్కొన్నారు.ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని దోషులను కఠినంగా శిక్షించాలి.అవసరమైతే ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి న్యాయం జరగేలా చూడాలని డిమాండ్ చేశారు.అక్రమంగా ఆయుధాలు వాడుతున్న రౌడీ మూలకాలను వెంటనే అదుపులోకి తీసుకోవాలని కోరారు.ప్రధాన రహదారులపై 24 గంటలపాటు పోలీసు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, అక్రమ పశువుల రవాణాను అరికట్టాలని విజ్ఞప్తి చేశారు.లేదంటే హిందూ సంస్థలు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతాయని హెచ్చరించారు.
కరీంనగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కరీంనగర్ ఆర్డిఓ కి వినతిపత్రం సమర్పించిన వారిలో ఊట్కూరి రాధా కృష్ణారెడ్డి, గోరక్ష స్టేట్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు, ఆదిమూలం విద్యాసాగర్, జిల్లా కార్యదర్శి,తోట రాజేందర్, జిల్లా సెక్రటరీ, విశ్వ హిందూ పరిషత్,అడగట్ల శ్రీనివాస్, వంశీ, మైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న 36 రోజుల హుండీ ఆదాయం 2 కోట్ల 19 లక్షలు





**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి హుండీల లెక్కింపు శుక్రవారం ఆలయ ఓపెన్ స్లాబ్ లో జరిగింది. ఈ లెక్కింపులో 2 కోట్ల,19 లక్షల,35 వేల,165రూపాయల నగదు, బంగారం 124 గ్రాముల 500 మిల్లీ గ్రాములు, వెండి 10 కిలోల 500 గ్రాములు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎల్. రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ హుండీల లెక్కింపులో ఏసీ కార్యాలయ పరిశీలకులు ఎం.రాజమౌళి, ఏఈఓలు, పర్యవేక్షకులు, ఆలయ సిబ్బంది, శ్రీ రాజరాజేశ్వర సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

# కార్తీక మాసం భీమేశ్వరాలయంలో భక్తుల పూజలు







- కోడె మొక్కులు చెల్లించుకున్న భక్తులు

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
కార్తీక మాసం వేములవాడ శ్రీ భీమేశ్వరాలయంలో భక్తుల రద్దీ నెలకొంది. శుక్రవారం భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి, దేవాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కోడె మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం ఆర్జిత సేవలైన అభిషేకాలు అన్న పూజలు కుంకుమ పూజలు, సత్యనారాయణ వ్రతాలు తదితర పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్తీకమాసం కావడంతో భక్తుల రద్దీ కనుగుణంగా ఆలయ అధికారులు అన్నీ ఏర్పాట్లు చేశారు. భీమేశ్వరాలయంలో భక్తులకు సకల సౌకర్యాలు కల్పించడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# జిల్లాను అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో ఉంచాలి

- రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం



**కరపత్రం ప్రతినిధి రాజన్న సిరిసిల్ల**
ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు విజయవంతంగా అమలు చేస్తూ జిల్లాను అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో నిలిపేలా పని చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్ పిలుపు ఇచ్చారు. ఇంచార్జి కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శుక్రవారం జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ప్రభుత్వ లక్ష్యాలు పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. రెసిడెన్షియల్, అన్ని విద్యాలయాల్లో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్యం అందించాలని పేర్కొన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి అన్ని శాఖల అధికారులు సమయానికి హాజరుకావాలని ఆదేశించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ గడ్డం నగేష్, ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పోచారంలో ప్రహరీగోడ తొలగింపు

- హైడ్రా చర్యలతో స్థానికుల ఆనందం

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్,అక్టోబర్24**
ప్రభుత్వ భూముల ఆక్రమణదారులపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నది. ఈ ఏడాది కాలంలో ఇప్పటి వరకు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో సుమారు రూ.60 వేల కోట్ల విలువైన వెయ్యి ఎకరాల ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుంది. చెరువులు, కుంటలకు కబ్జాదారుల నుంచి విముక్తి కల్పించి పునరుద్ధరిస్తున్నది. గ్రేటర్ హైదరాబాద్ పోచారంలో అక్రమంగా నిర్మించిన ప్రహరీ గోడను శుక్రవారం హైడ్రా తొలగించి 8 ఏళ్ల సమస్యకు పరిష్కారం చూపించింది. 1978లో 27 ఎకరాల ఎకరాల్లో 400 ప్లాట్లతో జీపీ లే అవుట్ ఏర్పాటు చేయగా.. అందులో ఓ వ్యక్తి 6.18 ఎకరాల భూమిని తమదే అంటూ అక్రమంగా ప్రహరీ నిర్మించాడు.

# ప్రభుత్వ ఉద్యోగులకు 2 పి ఆర్ సి ని వెంటనే ప్రకటించండి

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ అక్టోబర్ 24**
తెలంగాణ రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు రెండో పి ఆర్ సి అమలుపరచడానికి వేతన సవరణ కమిటీ చైర్మన్ ఎన్ శివశంకర్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారికి నియమించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అప్పటినుండి అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అన్ని ఉద్యోగ సంఘాలు వారి వారి అభిప్రాయాలను నివేదికలను పి ఆర్ సి కమిషన్ చైర్మన్ ఎన్ శివశంకర్ కి అందించటం జరిగింది వారు అందరు ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు ఇచ్చిన వినతి పత్రాలను అన్నిటిని పరిష్కరించి పిఆర్సి కమిషన్ చైర్మన్ ఎన్ శివశంకర్ తో పాటు కమిటీ సభ్యులందరూ ఒక నివేదిక తయారు చేయటం జరిగింది. ఆ నివేదిక రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి ఆర్థిక శాఖ బట్టి విక్రమార్క రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావుకు అందించిన వెంటనే రెండోవ పిఆర్సి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ప్రకటించవలసిన అవసరం ఎంతో ఉంది కానీ రెండో పి ఆర్ సి నివేదిక తయారై సంవత్సరం కరుస్తున్నప్పటికీ ఇప్పటివరకు పిఆర్సి కమిషన్ చైర్మన్ ఎన్ శివశంకర్ ఎందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి అందించలేకపోతున్నారు కావున వెంటనే పిఆర్సి కమిషన్ ఎన్ శివశంకర్ పిఆర్సి కమిషన్కు



సంబంధించిన నివేదిక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందించాలని తెలంగాణ వాణిజ్య పనుల శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ పిఆర్సి కమిషన్ చైర్మన్ ఎన్ శివశంకర్కు విజ్ఞప్తి చేశారు మన రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ప్రభుత్వ ఉద్యోగులు రెండవ పిఆర్సి వెంటనే అమలు అవుతుంది కావచ్చని ఎదురుచూస్తున్నారు మన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకొని రెండోవ పిఆర్సి నీ వెంటనే ప్రకటించి ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త అందించాలని మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ సీఎం సిఎస్ డిప్యూటీ సీఎం క్యాబినెట్ మంత్రులకు విజ్ఞప్తి చేశారు దాదాపు 2025 సంవత్సరము నుండి 2026 సంవత్సరంలోపు చాలామంది ప్రభుత్వ ఉద్యోగులు పదవి విరమణ అవుతున్నారు కనుక వారు రిటైర్మెంట్ అయ్యేవరకు రెండో పి ఆర్ సి తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటిస్తే పదవి విరమణ పొందుతున్న ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వ జీతాలు పెరిగే అవకాశం ఉంటుంది ఇక ఇంకా ఎప్పుడు పి ఆర్ సి తెలంగాణ రాష్ట్రంలో అమలవుతుందో అని ప్రభుత్వ ఉద్యోగులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు కావున ఇప్పటికైనా తెలంగాణ ముద్దుబిడ్డ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు చొరవ తీసుకొని వెంటనే తెలంగాణ రాష్ట్రంలో రెండవ పిఆర్సి నివేదికను తీసుకొని వెంటనే అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేసి అసెంబ్లీలో రెండవ పిఆర్సి నివేదికను అందరి శాసనసభ్యుల సమక్షంలో మన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిఆర్సి కమిషన్ అందజేసిన నివేదికను అందరు శాసనసభ్యుల సమక్షంలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలను పెంచడానికి ప్రకటన మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించాలని తెలంగాణ వాణిజ్య పనుల శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ విజ్ఞప్తి చేశారు

# పలు కార్యక్రమాల్లో వివిధ వివాహ వేడుకలలో పాల్గొని నూతన వరులను ఆశీర్వదించిన నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట అక్టోబర్ 24**
మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి శుక్రవారం నాడుపలు శుక్రవారం నాడుకార్యక్రమాల్లో పాల్గొన్నారు. నర్సాపూర్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన పలు వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులకు ఆశీర్వచనాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కోల్చారం మండలంలోని సంగాయి పేట గ్రామంలో ఓటు చోరీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదే గ్రామంలో నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. అదే మండలంలోని చిన్న ఘనపూర్ గ్రామంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మల్లేష్ను పరామర్శించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే ఆ ప్రమాదంలో మృతి చెందిన దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. తెలంగాణ రాష్ట్ర బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని విషయంలో కాంగ్రెస్ ఎంతో మద్దతు పలుకుతుందని కేంద్రంలో ఉన్నటువంటి బిజెపి ప్రభుత్వం వలనే బీసీలకు అన్యాయం జరుగుతుందని ఆయన





తెలియజేశారు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న బీసీలకు 42 శాతం ప్రకటిస్తే మిగతా రాష్ట్రాలకు కూడా తనప్రకటిస్తే భారతదేశంలో మిగతా రాష్ట్రాలలో ఉన్న బీసీలు తమ ప్రభుత్వంపై ఉద్యమాలు చేపడతారు అని తపనతో



తెలంగాణ రాష్ట్ర బీసీలకు అన్యాయం చేస్తున్నారని ఆయన ఆరోపించారు గతంలో తెలంగాణ రాష్ట్రాన్ని పరిపాలించిన ప్రభుత్వ పాలనలో బీసీలకు ఎటువంటి న్యాయం జరగలేదని ఆయన అన్నారు నేడు తెలంగాణ రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వంపై టి నేడు తెలంగాణ రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ పార్టీ ఎన్నో ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుతున్నారని తెలంగాణ రాష్ట్రంఏర్పాటయి పది సంవత్సరాలు పరిపాలన సాగించినటువంటి బి.ఆర్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి ఏమి ఒరగా పెట్టిందని ఆయన మండిపడ్డారు పడ్డారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# పలు గ్రామాల్లో నూతన వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన

## - మార్కెట్ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి మార్కెట్ డైరెక్టర్ ఎగేటి సదానందం

- ఏపిఎం కొమురయ్య శ్రీనివాస్ సి సి బిఈ సుమలత ఆధ్వర్యంలో ఐకెపి సెంటర్లు ప్రారంభం
- ఐలోని సాంబశివ రెడ్డి మాజీ ఉపసర్పంచ్ పోసిని సత్యనారాయణ

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంటఅక్టోబర్ 24**
కరీంనగర్ జిల్లాజమ్మికుంట మండలంలోని పలు గ్రామాల్లో ఐకెపి సెంటర్లనుమడిపల్లి నాగంపేట వెంకటేశ్వర్ల పల్లెబిజిగిరి షరీఫ్ గ్రామంలో ఏర్పాటు చేసిన నూతన వడ్ల కొనుగోలు రైతులుశు క్రవారంప్రారంభించారుఈ సందర్భంగా మడిపల్లి గ్రామ శాఖఅధ్యక్షులు ఐలోని సాంబశివ రెడ్డిమాట్లాడుతూ, రైతులు కష్టపడి పండించిన వడ్లను ఎలాంటి కటింగ్ లేకుండా కొనుగోలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వడ్ల కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు



కలగకుండా చూడాలని సూచించారు. ఎప్పటికప్పుడు కొనుగోలు కేంద్రాలను పరిశీలించి తగిన చర్యలుతీసుకోవాలనితెలిపారుఅలాగే సన్న వడ్ల కొనుగోలు కూడా జరుగుతుందని, రైతులకు ప్రభుత్వం బోనస్ అందజేస్తుందని పేర్కొన్నారురైతులు మిల్లర్లతో మాట్లాడుకోవాలని ఎవరు చెప్పినా అది తగదుమిల్లర్లతో మాట్లాడే బాధ్యత అధికారులదే. రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం అండగా ఉంటుందిఅని స్పష్టం చేశారువడ్ల కొనుగోల్లో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా మీ నాయకుడిగా నాదే బాధ్యత గ్రామ శాఖ అధ్యక్షులు



ఐలోని సాంబశివ రెడ్డిఅన్నారు ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి మార్కెట్ డైరెక్టర్ ఎగేటి సదానందంమాజీ ఎంపీపీ రాజమల్లు గౌడ్.మాజీ ఉప సర్పంచ్ పోసిని సత్యనారాయణ మాకమల్ల అశోక్ఏపిఎం కొమురయ్య శ్రీనివాస్ సి సి డి ఈ సుమలతవివో ఏ ఐ పరమేశ్వరి సిఏ ప్రియాంక సి ఎ స్వప్న ప్రజా ప్రతినిధులు రైతులు మహిళా సంఘాల సభ్యులురెండు సంఘాలఅమాలి సంఘం అధ్యక్షులుగ్రామ రైతులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# శ్రీ వర్షిత ది ముమ్మాటికి ప్రభుత్వ హత్యే....

- మృతురాల కుటుంబానికి కోటి రూపాయలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలి
- పాఠశాల ప్రిన్సిపల్ సస్పెండ్ చేయాలి
- చాతగాని ముఖ్యమంత్రి రాజీనామా చేయాలి
- మృతురాలి కుటుంబానికి కౌశిక్ రెడ్డి 50వేల ఆర్థిక సాయం
- హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ అక్టోబర్ 24**
గురుకులం రెసిడెన్షియల్ పాఠశాల వంగరలో చదువుతున్న శ్రీ వర్షిత ది ముమ్మాటికి ప్రభుత్వ హత్యేనని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం హుజురాబాద్ లోని ప్రభుత్వ ఆసుపత్రి లో ఆత్మహత్యకు పాల్పడిన చిన్నారికి న్యాయం చేయాలంటూ వర్షిత మృతదేహంతో అంబేద్కర్ చౌరస్తాలో చేపట్టిన ధర్నాలో భాగంగా ఆయన మాట్లాడారు. హుజురాబాద్ మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన తిరుపతి కూతురు శ్రీ వర్షిత ప్రిన్సిపల్ వేధింపులు భరించలేక మరణించింది అని ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి





విద్యాశాఖ తన ఆధీనంలో పెట్టుకొని పేద విద్యార్థులకు న్యాయం చేయాల్సింది పోయి వారి ఆత్మహత్యలకు కారణం అవుతున్నారని ఆరోపించారు. కెసిఆర్ హయాంలో విద్యార్థులు అన్ని రకాల వసతులతో పాటు రక్షణతో కూడిన విద్యను అందించారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యార్థులకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలతో మొదలుకొని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, విద్యాసంస్థలలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ఇటీవల కాలంలో ప్రభుత్వ నిర్లక్ష్యంతో పలు పాఠశాలల్లో విద్యార్థులకు ఎలుకలు, కుక్కలు కోతులు కరిచిన సంఘటనలు కూడా ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసమర్థ పాలనతోనే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం వెంటనే కోటి రూపాయలు ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. శ్రీ వర్షిత ఆత్మహత్యకు కారణమైన ప్రిన్సిపాల్ ను విధుల నుంచి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అసమర్థ పాలనకు విద్యార్థుల జీవితాలు బలవుతున్నాయని అన్నారు. అనంతరం మృతురాలు వర్షిత కుటుంబానికి 50వేల ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ప్రకటించారు. ఎమ్మెల్యే వెంట మృతురాలి తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..